# ఇన్లాండ్ లెటర్ కథలు

## వివక్ష

తెల్లవారుజామున అయిదుగంటలు కావస్తోంది.

విజయవాడ రైల్వే స్టేషన్ ప్రయాణికుల సందడితో సూర్యోదయానికి స్వాగతం పలుకుతోంది.

అయిదుగంటలకు రావలసిన రైలు మాట. ఇరవై నిమిషాలు ఆలస్యమని ఎనౌన్సర్ గొంతు చిన్నగా వినిపించింది. ప్రయాణికులలో కలవరం, నిరాశ వ్యక్తమవుతున్నాయి.

నేను కూడా బెంచీపై నిరాశగా కూలబడ్డాను. ప్రతి కొన్ని నిమిషాలకు వాచీ చూసుకుంటున్నాను. ఆ రైలులో నా స్నేహితురాలు అపర్ణ రావలసి వుంది. రెండు రోజుల క్రితమే తను విజయవాడకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నానని ఫోన్ చేసింది. అందుకే ఈ ప్రయాస.

అపర్ణా, నేనూ కాలేజీ స్థాయి వరకు కలిసి చదువుకున్నాం. తను యూనివర్సిటీ స్థాయి వరకు వెళ్ళింది. ఆ తర్వాత అదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం. నేను విజయవాడలో ఓ చిన్నపాటి ఉద్యోగం చేస్తున్నాను. మా ఇద్దరి దారులు వేరయ్యాయి. అపర్ణది కలకత్తా. నాది విజయవాడ. అప్పుడప్పుడు ఉత్తరాలు అంతే.

గతం ఆలోచనలనుంచి బయటపడకుండానే రైలు ప్లాట్‌ఫాంపై పెద్ద శబ్దంతో ఆగింది. అపర్ణని వెదకడానికి ఓ పది నిమిషాలు పట్టింది. ఆటోలో ఇంటికి చేరుకున్నాం. ఎందుకో అపర్ణ మౌనంగా వుంది. ఆటోలో కూడా ఏమీ మాట్లాడలేదు.

స్నానపానాదులు ముగించాక అడిగాను అపర్ణని– ఎప్పుడూ గలగలమని మాట్లాడే నువ్వు మౌనంగా వుండడానికి కారణమేమిటని.

నన్ను యూనివర్సిటీ నుంచి వెలివేశారు. ఉద్యోగం నుంచి బలవంతంగా తొలగించారు.

ఏం ఎందుకని ఆవేదనతో అడిగాను.

సల్వార్ కమీజ్ ధరించి పాఠాలు చెబుతున్నందుకు. చీర కట్టుకుని



పాఠాలు చెబితే మళ్ళీ ఉద్యోగం ఇస్తారట. బాధ్యతాయుతమైన ఉద్యోగం చేస్తూ పురుషాధిక్యతకు తలవంచడం నాకు ఇష్టంలేకపోయింది. అందుకే అక్కడ నా ఉద్యోగాన్ని మళ్ళీ పొందగలననే ఆశ పోగొట్టుకున్నాను.

మరి విజయవాడ రావడానికి కారణమేమిటి అపర్ణా ప్రశ్నించాను.

స్వాతి నాకు జరిగిన అన్యాయంపై ఈ నగరంలో ఓ చర్చ పెట్టాలనే ఆలోచన కలిగింది. ఒక సభను నీ సహకారంతో ఏర్పాటుచేస్తున్నాను. మేధావులను, పాత్రికేయులను ఆహ్వానిస్తాను. ఈ చర్చ వలన జరిగేదేమిటి అపర్ణా

ఈ చర్చ భారతదేశమంతటా జరగాలి. అందుకు విజయవాడ ఓ వేదిక కావాలి. ఈ చర్చల వలన మగవానిలో అహం నశించాలి. స్త్రీ స్వేచ్ఛ విషయంలో పురుషుల ఆలోచనా విధానం మారాలి. నేను బలి పశువుని అయినా పర్వాలేదు. ఆలస్యంగానైనా స్త్రీలకు మేలుజరగాలి. దానికి నీ సహకారం కావాలి. స్వాతి రేపే ఆడిటోరియం మాట్లాడడానికి వెళ్దాం.

–అరసవెల్లి కృష్ణ

## మానవత్వం

ఎందుకో... నాకా అమ్మాయి రూపమే కళ్ళముందు కదులుతుంది. పట్టుమని పద్దెనిమిదేళ్ళు పూర్తవ్వని వయసు వయస్సు తెచ్చే అల్లరితో, అల్లిబిల్లి కలల్ని ప్రోది చేసుకుంటూ, గలగలాపారే సెలయేరులా నవ్వుతూ, తుళ్ళుతూ గడపవలసిన వయస్సులో ఎంత బాధ్యతను... తన లేత భుజస్కంధాలపై వేసుకుంది.



ఆ అమ్మాయి తనకి బస్సులో పరిచయమైంది. ఆ బస్సు గురించి గంటసేపటినుంచి ఎదురుచూస్తున్న ప్రయాణికులు బస్సురాగానే ఆడ, మగ అనే తేడాలేకుండా రెండువైపులనుంచి ఎగబడ్డారు. ఇదే అదనుగా తలచి ఎవరో ఆ అమ్మాయి హేండ్‌బ్యాగ్ కత్తిరించి అంతర్ధానమయ్యాడు. అంత రద్దీలోనూ ఆమె కళ్లలో హడావుడి, భయం, గాభరాను గమనించింది నేనొక్కడినే. ఏమిటి? ఏమైంది? ప్రశ్నించాను. పాపం... ఏడుపొక్కటే తరువాయి... నా హేండ్‌బ్యాగ్... ఎవరో దొంగిలించారండి... నా నెల జీతం అందులోనే వుంది... మాటలు కూడబలుక్కుంటూ కన్నీళ్ళు చిప్పిల్లుతుండగా చెప్పింది. ఇది షరామామూలేనంటూ పక్కనున్న వ్యక్తి తీసిపారేశాడు. అంత అజాగ్రత్తగా వుంటే ఎలాగమ్మా ఆ... అంటూ గదమాయించాడు మరొక వ్యక్తి. వీరందరూ స్వచ్ఛంగావున్న కొలనుపై తలొక రాయి విసిరేవారని నాకు తెలును. జుట్టు చెదిరిపోయి ముఖం పీక్కుపోయి కదనరంగంలోని అభిమన్యుడిలాంటి ఓ వ్యక్తి మా వద్దకు వచ్చి చేయి చాపాడు. అతను కండక్టర్ అని చెప్పనవసరం లేదు. ఆ అమ్మాయికి నాకు కలిసి టిక్కెట్ తీశాను. ఇందాక సానుభూతి కురిపించిన పెద్దమనుషులిద్దరూ గుంభనంగా నవ్వుకోవడం నా కళ్లదాటిపోలేదు. మేం దిగవలసిన స్టాప్ వచ్చింది. దిగిన వెంటనే ఆ అమ్మాయి నావంక కృతజ్ఞతగా చూసింది. మాటల్లో ఆమెది తమ పక్కవీధేనని పక్షవాతి రోగియైన తండ్రి, యిద్దరు చెల్లెళ్లు, తల్లికీ తనే ఆధారంఅని, తను ఓ చిన్న కంపెనీలో చిరుద్యోగినినీ చెప్పింది. పాపం తన జీతం డబ్బుపోయింది. ఈనెల గడవడమెలా? ఆలోచించి జేబులోంచి ఐదువందల రూపాయలు తీసి చేతిలో పెట్టాను. ఆ అమ్మాయి గాభరాగా చూసింది. ఫర్వాలేదమ్మా. వుంచు. గడ్డు పేదరికాన్ని అనుభవించి వేసీ స్థితికి వచ్చాను. రక్త సంబంధాల్లోకూడా స్వార్థాన్ని వెదుక్కునే ఈ రోజుల్లో లేత వయస్సులోనే నీ జీవితానికే అర్థం వెతుక్కున్న నీవు ధన్యురాలివమ్మా! అంటూ వెనుదిరిగాను. కాలుతున్న సిగరెట్ చురుక్కుమనడంతో ఆలోచనలోంచి బయటికి వచ్చాను. అవును ఆ అమ్మాయికి మంచి ఉపాధి చూపాలి... చూపాలి... నిశ్చింతంగా కళ్ళుమూసుకున్నాడు.

–గొల్లె విశ్వప్రతాప్,

అంతకాపల్లి

కొత్త రచయితలు మాత్రమే ఇన్లాండ్ కవర్‌మీద కథలు రాసి పంపాలి.